క్లుప్తంగా

షూటింగ్‌లో నగర విద్యార్థి ప్రతిభ



బంగారు పతకం సాధించిన నసీర్

ఎంవీపీకాలనీ: ఆగ్రాలో జరిగిన 10వ అంతర్జాతీయ క్రాస్ బౌ షూటింగ్ చాంపియన్ షిప్‌లో నగర విద్యార్థి నసీర్ ప్రతిభ కనబరిచాడు. బంగారు పతకం సాధించి సత్తా చాటాడు. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న నసీర్ ఎంవీపీ కాలనీలో నివాసముంటున్నాడు. అదే కాలనీలోని ఓ షూటింగ్ అకాడమీ ద్వారా శిక్షణ పొందుతున్నాడు. ఈ నెల 26 నుంచి 31 వరకు ఆగ్రాలో జరిగిన ఈ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా పలువురు నగర క్రీడా ప్రముఖులు, కుటుంబ సభ్యులు నసీర్‌కు అభినందనలు తెలిపారు.

బీసీలకు రాజ్యాధికారమే ధ్యేయంగా రథయాత్ర

బీచ్‌రోడ్డు: బీసీలకు రాజ్యాధికారమే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా రాజ్యాధికార రథయాత్ర, బహిరంగ సభలను నిర్వహించనున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం బడుగుల కోసం అన్ని రాజకీయ పార్టీలు ఆలోచించే పరిస్థితికి వచ్చాయంటే అందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కారణమన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీల నుంచి బీసీలకు అధిక సంఖ్యలో సీట్లు సాధించడంతో పాటు, వాటిని బీసీల అభివృద్ధికి పోరాడే వారికి కేటాయించేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రథయాత్ర, బహిరంగ సభల వివరాలను నవంబర్ 10వ వెల్లడించనున్నట్టు తెలిపారు.

పదవీ విరమణ చేసిన ఏఎస్‌ఐకు సత్కారం



పదవీ విరమణ చేసిన ఏఎస్‌ఐ తులసిగిని సన్మానిస్తున్న సీపీ డాక్టర్ రవిశంకర్

దొండపర్తి : పదవీ విరమణ చేసిన ఏఎస్‌ఐ గుత్తుల తులసిగిని మంగళవారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తన చాంబర్‌లో సత్కరించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. 1984లో మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన తులసిగి 2012లో హెడ్ కానిస్టేబుల్‌గా, 2018లో ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. విధి నిర్వహణలో పలు క్యాష్ రివార్డులు అందుకున్నారు. పదవీ విరమణ చేసిన తులసిగి, అతని కుటుంబ సభ్యులకు సీపీ శుభాకాంక్షలు తెలిపి, పోలీస్ శాఖలో 40 ఏళ్ల సుదీర్ఘ సర్వీస్ చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. కుటుంబ సభ్యుల సమక్షంలో తులసిగిని సత్కరించి వీడ్కోలు పలికారు.

కనులపండువగా అప్పన్న కల్యాణం



యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

చారిత్రక భవనానికి ఆధునిక శోభ

- లిఫ్ట్ సదుపాయం
- వర్టికల్ గార్డెన్, గ్లాస్ ఫేసిడ్ ఎలివేషన్



పాత భవనం



నూతనంగా అభివృద్ధి చేసిన తరువాత ..

ఏయూక్యాంపస్: చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆంధ్రవిశ్వవిద్యాలయం పరిపాలనా భవనం ఆధునిక శోభను సంతరించుకుంది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ భవనానికి ఆధునిక వసతులను కల్పిస్తూ సుందరంగా తీర్చిదిద్దారు. నెల రోజులుగా జరుగుతున్న ఆధునీకీకరణ, భవన ఎలివేషన్ పనులు పూర్తయ్యాయి. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తిచేయించారు. చారిత్రక భవనం ప్రాధాన్యతను, విశిష్టతను పరిరక్షిస్తూ ఆధునిక వసతులను జోడించడం విశేషం.

వర్సిటీ పరిపాలన మొత్తం జరిగే ఈ భవనం కార్పొరేట్ కార్యాలయాలను తలపిస్తూ ఆధునికతతో ఉట్టిపడుతోంది. భవనంలో ఉన్న పాత కిటికీల స్థానంలో కొత్త యూపీవీసీ కిటికీలు, ప్లంబింగ్ లైన్లను పూర్తిస్థాయిలో మార్పు చేశారు. ఎలివేషన్ మార్పుచేసి, పెయింటింగ్ చేశారు. భవనాన్ని ఎలివేషన్ గ్లాస్ ఫేసిడ్ వర్క్‌తో కళాత్మకంగా తీర్చిదిద్దారు. ఏయూ ఆర్కిటెక్చర్ విభాగం ఆచార్యులు విశ్వనాథ కుమార్ దీనిని డిజైన్ చేశారు. ఏసీపీ షీట్స్ ఉపయోగించి భవనాన్ని ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. భవనం లోపల నూతనంగా లిఫ్ట్ సదుపాయం ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం సులభంగా వర్సిటీలోని అన్ని విభాగాలకు వెళ్లడానికి, అధికారులను కలుసుకోవడానికి వీలుగా నూతనంగా లిఫ్ట్ కల్పించారు. భవనం కింది, మొదటి అంతస్తుల్లో కారిడార్‌లలో నూతనంగా ప్రకాశవంతమైన లైటింగ్ ఏర్పాటు చేశారు.

వర్టికల్ గార్డెన్ ప్రత్యేక ఆకర్షణ

భవనం ఎలివేషన్‌లో ఉపయోగించిన ప్రత్యేకమైన గ్లాస్ వర్క్ , వర్టికల్ గార్డెన్ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఆధునిక సొబగులు అద్దుతూనే ప్రకృతికి, పచ్చదనానికి తగిన ప్రాధాన్యత కల్పించారు. భవనానికి రెండు వైపులా వర్టికల్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేసి, వీటిలో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. అదే విధంగా భవనం రెండు వైపులా లాండ్‌స్కేపింగ్ చేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



22 వార్డులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం



వైద్య శిబిరంలో వైద్యాధికారి రెహినీషా , సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులోని 1086147 సచివాలయంలో మంగళవారం నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతాల గోవింద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీను, బాష, శశికళ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

516 మందికి వైద్య పరీక్షలు

మద్దిలపాలెం: జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పాత వెంకోజీపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రెహినిషా అన్నారు. మద్దిలపాలెం సచివాలయం పరిధిలోని ఇసుకతోటలో జగన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 516 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్ తెలిపారు. మెరుగైన వైద్యం కోసం ఐదుగురిని కేజీహెచ్‌కు తరలించామని వైద్యాధికారి చెప్పారు.

ఏపీ పీటీడీ చైర్మన్ దృష్టికి ఉద్యోగుల సమస్యలు



ఏపీ పీటీడీ చైర్మన్ మల్లికార్జున రెడ్డికి ఉద్యోగుల సమస్యలను వివరిస్తున్న ఎన్‌ఎంయూఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖ ఉద్యోగుల సమస్యలను ఆ శాఖ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జున రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్టు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.వి.రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలో చైర్మన్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించి, వినతిపత్రం అందజేశామని వారు చెప్పారు. ఎరియర్స్‌ను సంస్థ పరంగా ఉద్యోగులకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, కావాలిలో దుండగుల దాడి వల్ల తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న డ్రైవర్ రాజా సింగ్‌ను ఆదుకోవాలని, సత్వరం కొత్త బస్సులు కొనుగోలుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. చైర్మన్ మల్లికార్జున రెడ్డి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసురాజు, సంయుక్తకార్యదర్శి రావి సుబ్బారావు, అనంత రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఆళ్వార్‌దాస్ కృషి చిరస్మరణీయం



ఆళ్వార్‌దాస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: రాష్ట్రంలో ఉన్నత విద్యావ్యాప్తికి ఆళ్వార్‌దాస్ చేసిన కృషి చిరస్మరణీయమని ఐఏఎం కార్యదర్శి సుంకరి రవీంద్ర తెలిపారు. సుంకరి ఆళ్వార్‌దాస్ జయంతిని ఆళ్వార్‌దాస్ గ్రూప్ ఆధ్వర్యంలో మంకవారం ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కళాశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులతో పాటు ఆళ్వార్‌దాస్ గ్రూప్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐఏఎం కార్యదర్శి సుంకరి రవీంద్ర మాట్లాడుతూ విశాఖలో కళాశాలలను ఏర్పాటు చేసి విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. దాదాపు 35 విద్యాసంస్థలు ఆళ్వార్‌దాస్ గ్రూప్ ద్వారా విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నాయన్నారు. నడవండి – నడిపించండి నినాదంతో 1986లో ఆయన స్థాపించిన వాకర్స్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయంగా విశిష్ట సేవలు అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుంకరి రాజేంద్ర, విజయ రాజేంద్ర, విజయ రవీంద్ర, ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు పలువురు కుటుంబ సభ్యులు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పాల్గొన్నారు. సమత డిగ్రీ కళాశాల, ఐఐఎంలలో ఆళ్వార్‌దాస్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు



వివిధ వేషధారణల్లో చిన్నారులు

ఎంవీపీకాలనీ: ప్రసిద్ధ హాలోవీన్ పండగను స్థానిక ఆళ్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్‌లో ఉత్సాహం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు దెయ్యాలు, రాక్షసులు, మంత్రగత్తెలు వేషధారణల్లో అలరిస్తారన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఆళ్వార్‌దాస్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా స్కూల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్యాదాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుతో పాటు మానసిక ఉత్సాహాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు.

అపోలోలో రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ



మీడియాతో మాట్లాడుతున్న అపోలో అంకాలజీ వైద్యులు

ఆరిలోవ: అపోలో ఆస్పత్రిలో అత్యంత కచ్చితంగా రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ జరుగుతుందని అంకాలజీ వైద్య నిపుణుడు బోయ రాకేష్ రెడ్డి తెలిపారు. హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రి క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అత్యంత వేగంగా కచ్చితంగా రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించే అధునాతన చికిత్స అపోలోలో అందిస్తున్నట్లు తెలిపారు. మామోగ్రఫీ, అల్ట్రా సౌండ్, బయాప్సీ, అధునాతన డయాగ్నోస్టిక్ టెక్నాలజీ ఇక్కడ అందుబాటులో ఉందన్నారు. మహిళలు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనికి సంబంధించిన లక్షణాలు ఉన్నప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. రేడియో అంకాలజిస్టులు డాక్టర్ సుమన్ దాస్, ఎం.పి.ఎస్ చంద్రకల్యాణ్ మాట్లాడుతూ ముందస్తు రోగ నిర్ధారణ మంచి ఫలితాలనిస్తుందన్నారు. ఇక్కడ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి వ్యాధిగ్రస్తులకు సకాలంలో ఉత్తమ వైద్యం అందించి మంచి ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. సమావేశంలో అంకాలజీ విభాగం వైద్యులు పాల్గొన్నారు.

10 నుంచి చెకుముఖి సంబరాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో చంద్రకళ తదితరులు

మధురవాడ: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి చెకుముఖి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.కె.పరశురామ్ తెలిపారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఈ వేడుకలకు సంబంధించి పోస్టర్‌ను విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో చంద్రకళ, సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ ఈ నెల 10న పాఠశాల స్థాయి, 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోటాన శ్రీనివాస్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దేముడుబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

2న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో నవంబర్ 2న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు తెలిపారు. పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని పేర్కొన్నారు.

ఐకమత్యమే దేశ సంపద

ఏయూలో ఐక్యత దివస్ నిర్వహణ



వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి



వల్లభాయిపటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న షారోన్ రాజు, విద్యార్థులు



ఐక్యత ప్రతిజ్ఞ చేస్తున్న ఫిషర్‌మెన్ స్కూల్ విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఐకమత్యమే మన దేశ నిజమైన సంపదగా, శక్తిగా నిలుస్తోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, ఐక్యతా దివస్‌ని ఏయూలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పటేల్ చిత్రపటానికి ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ విభజన అనంతరం దేశాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చి, సమైక్య పరచడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఓఎస్‌డీ వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ వై.రాజేంద్ర ప్రసాద్, జాతీయ సేవా పథకం సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, డీఆర్ ఆర్.శ్రీనివాస్, ఏఆర్ డాక్టర్ జి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యవిభాగంలో ..

ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యవిభాగంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. భారత దేశ ఐక్యతకు ప్రతీకగా పటేల్ నిలుస్తారన్నారు. ఆయన జయంతిని ఐక్యతా దివస్‌గా జరుపుకొంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంవీపీకాలనీ: జాతీయ ఐక్యత దినోత్సవాన్ని ఎంవీపీ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీ ఫిషర్‌మెన్ స్కూల్‌లో విద్యార్థులు ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ భాస్కరరావు మాట్లాడుతూ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవాన్ని ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఉద్యోగులు సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

బీజేపీ నగర శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్తేర్ క్లబ్ కూడలిలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో

మద్దిలపాలెం: జాతీయ ఐక్యత దినోత్సవాన్ని మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ ఐక్యత దినోత్సవంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులతో జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పోలా ఉమామహేశ్వరరావు, శ్యామ్యూల్ డేవిడ్ రాజ్, జి.వి.ప్రతాప్, బి.లక్ష్మి పాల్గొన్నారు.

దేశ సంస్కృతి, సంప్రదాయలను కాపాడుకోవాలి

బీచ్‌రోడ్డు: మన దేశ సంస్కృతి, సనాతన ధర్మం, చారిత్రక కట్టడాలు, కుటుంబ బంధాలను కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలని విశాఖ వాలీ స్కూల్ విద్యార్థులు కోరారు. జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా విశాఖ వేలీ స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం బీచ్‌రోడ్డులో ఐక్యత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో పాల్గొని, వారి గొప్పతనం వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ అమర పాల్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హిందుస్తాన్ షిప్‌యార్డ్ ఆధ్వర్యంలో

హిందుస్తాన్ షిప్‌యార్డ్ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీని ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



జాతీయ ఐక్యత దినోత్సవంలో కృష్ణా కళాశాల అధ్యాపక బృందం



ఐక్యత ర్యాలీ చేస్తున్న విశాఖ వేలీ స్కూల్ విద్యార్థులు

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రేష్మ ప్రతిభ



రేష్మను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మురళీధర్

సబ్బవరం: జూనియర్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని ఎస్.రేష్మ ప్రతిభ చూపింది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ఈ పోటీల్లో ఆంధ్రా జట్టు తరఫున ఆమె ప్రాతినిధ్యం వహించింది. గోవా జట్టుతో జరిగిన తుది పోరులో ఆంధ్రప్రదేశ్ జట్టు ఓటమి చెంది ద్వితీయస్థానంలో నిలిచింది. తుది పోరులో రేష్మ ప్రతిభ చూపి, కళాశాలకు గుర్తింపు తీసుకొచ్చిందని ప్రిన్సిపాల్ పి.మురళీధర్ తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె.వి. రమణారావు, ఇతర ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

నడక, పరుగు అలవాటు పెంచేందుకే ఫ్రీడమ్ రన్



ఆటోనగర్ వాసీవా వద్ద ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్‌లో పాల్గొన్న వాసీవా, ఏపీఐఐసీ ఐలా, డీఐసీ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని విశాఖపట్నం ఎంఎస్‌ఎంఈ – డీఎఫ్‌వో ఆధ్వర్యంలో ఏపీఐఐసీ ఐలా, వాసీవా, డీఐసీ సంయుక్తంగా ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 4.0ను నిర్వహించాయి. మంగళవారం ఆటోనగర్ వాసీవా భవనం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 40 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ఎంఎస్‌ఎంఈ ఏడీ చంద్రమౌళి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతిల ప్రాముఖ్యతను పురస్కరించుకుని యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ 2020లో ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ ప్రారంభించిందని చెప్పారు. మెరుగైన ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం ప్రజల్లో నడక, పరుగు అలవాటును పెంపొందించడమే ఈ రన్ లక్ష్యం అన్నారు.

ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ నాల్గవ ఎడిషన్ ఈ సంవత్సరం స్వచ్ఛ భారత్, స్వాస్థ్య భారత్ థీమ్‌తో ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్‌గా అక్టోబర్ 1 నుంచి 31 వరకు నిర్వహించినట్టు తెలిపారు. ఎంఎస్‌ఎంఈ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ బి.ఎ.ఎ.వి. ప్రభాకర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు ఎస్.ఎల్.ఎన్. కుమార్, వీరయ్య, రేవతి, వినోద్, సుబ్బారావు, సన్యాసిరావు, ఐలా చైర్మన్ రఘు, వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, డీఐసీ జీఎం సీహెచ్ గణపతి, ఫ్యాప్సీ అధ్యక్షుడు మురళీ కృష్ణ, వాసీవా ప్రతినిధులు రాంప్రసాద్, పర్చూరు ప్రభాకర్, అనార్‌బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నాకౌట్‌కు సీనియర్ వుమెన్ జట్టు



ఆంధ్ర సీనియర్ వుమెన్ జట్టు

విశాఖ స్పోర్ట్స్ : బీసీసీఐ సీనియర్ వుమెన్ క్రికెట్ నాకౌట్‌కు ఆంధ్ర జట్టు అర్హత సాధించింది. టీ20 ట్రోఫీ లీగ్ దశలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఆంధ్ర మహిళా జట్టు ఐదింట విజయాలు సాధించింది. నవంబర్ మూడో తేదీనుంచి నాకవుట్ పోటీలు ప్రారంభం కానుండగా తొలి మ్యాచ్‌లో ముంబయ్‌తో తలపడనుంది. ఈ సందర్భంగా జట్టును ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథరెడ్డి అభినందించారు.